ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 13 మార్చి 2024



కాసులతో ఆట.. ఓట్ల కోసం వేట...

- అధికార పార్టీ బరితెగింపు
- వారం పాటు ఖర్చులకు.. పోలింగ్ కేంద్రానికి రూ.20 వేలు
- ఎన్నికలు ముగిసే వరకు ఇదే తంతు
- ముఖ్య నాయకుల చేతుల్లో డబ్బు
- విందు, వినోదాలతో యువతను ఆకర్షించే యత్నం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు అధికార పార్టీ ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసింది. మదనపల్లె, రాజంపేట అసెంబ్లీ స్థానాలలో సిట్టింగ్‌లను మార్చింది. అభ్యర్థుల పంచాయతీ కొలిక్కిరావడంతో ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ఐదు సంవత్సరాలలో అనేక ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపైన తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో ఓటమిపై నమ్మకం లేకపోవడంతో అధికార పార్టీ ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలు యథేచ్ఛగా చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే మహిళా ఓటర్లకు గాలం వేసేందుకు పట్టుచీరల పంపిణీ చేపట్టింది. సకుటుంబ సపరివారసమేతంగా అనే చందంగా స్థానిక అధికార పార్టీ చోటామోటా నాయకులు, వలంటీర్లు ఓటర్ల ఇంటికి వెళ్లి చీరలు ఉన్న బ్యాగులు ఇచ్చి జగన్‌కు ఓటెయ్యండి అంటూ అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఈ పంపిణీ పూర్తయినట్లు సమాచారం. అదే సమయంలో ప్రభుత్వం నుంచి గౌరవవేతనం రూపంలో వేతనాలు అందుకుంటున్న వలంటీర్లు నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకి ఓటెయ్యమని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతున్నారు. మిగిలిన నియోజకవర్గాలలో కూడా ఈ చీరల పంపిణీ ఒకటి రెండు రోజుల్లో పూర్తి కావచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఈ వారంలో ఎన్నికల కోడ్ వస్తున్న నేపథ్యంలో అప్పటికే కానుకల పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికార పార్టీ ఉన్నట్లు సమాచారం.

యువత ఓట్ల కోసం ఎన్నో ఎత్తులు

కొత్తగా ఓటు హక్కు పొందిన వాళ్లు, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం రాక నిరుద్యోగులుగా ఉన్న వారిని ఆకర్షించే లక్ష్యంతో గతఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఆడుదాం ఆంధ్ర అంటూ రాష్ట్ర ప్రభుత్వం తెగ హడావుడి చేసింది. వార్డు, గ్రామ స్థాయి నుంచి మండలం, నియోజకవర్గం, జిల్లా రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహించి పెద్ద మొత్తంలో ప్రైజ్‌మనీ ప్రకటించింది. దీంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులు తమ ఓటర్లుగా మారిపోతారని రాష్ట్ర ప్రభుత్వం పగటి కలలు కనింది. అయితే ఈ పోటీల్లో క్రికెట్, కబడ్డీ తప్ప మిగిలిన ఆటలకు పెద్దగా స్పందన రాలేదు. ఈ ఆటల్లోనూ.. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. చాలాచోట్ల అధికార పార్టీ నాయకులు జోక్యం చేసుకుని తమకు కావాల్సిన జట్లనే విజేతలుగా చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతోఆశతో చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా.. అట్టర్‌ఫ్లాప్ అయిందనే విమర్శలు యువత నుంచి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో యువకులను బుట్టలో వేసుకునేందుకు కొత్త ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రంలోని యువకులకు ఖర్చు చేసేందుకు వారానికి రూ.20 వేలు చొప్పున స్థానికంగా ఉన్న ముఖ్య నాయకులు, కార్యకర్తల చేతికి డబ్బు అందినట్లు సమాచారం. ఎన్నికలు అయిపోయే వరకు ప్రతివారం ఈ డబ్బు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండే యువతను పిలిపించి పిచ్చాపాటి మాట్లాడి.. తమ ప్రభుత్వం గొప్పదని చెబుతూ వాళ్లకు మందు, విందు సమకూర్చమని పైస్థాయి నుంచి సూచనలు వచ్చినట్లు ప్రచారంలో ఉంది. గత వారంలో జిల్లాలోని పలు నియోజకవర్గాలలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, కింది స్థాయి నాయకులు, వలంటీర్లు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. వలంటీర్ల పర్యవేక్షణలో స్థానిక నాయకులు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ప్రజావ్యతిరేకత తట్టుకోవడం సాధ్యమేనా ?

ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ చేస్తున్న ఇటువంటి చర్యలపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. మన బంగారం మంచిదైతే కంసాలి దగ్గరకు ఎందుకు? అనే విధంగా గత ఐదు సంవత్సరాలలో నిజంగానే జగన్ ప్రభుత్వం ప్రజారంజక పాలన చేసుంటే ఈ అడ్డదారులు తొక్కాల్సిన పనేముందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా వాస్తవానికి అర్హులకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరలేదు. రాష్ట్రప్రభుత్వం అడ్డదిడ్డమైన ఆంక్షలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోత పెట్టింది. పెన్షన్లు, అమ్మఒడి వంటి పలు పథకాల్లో ప్రభుత్వం చేసిన ఈ మోసాన్ని లబ్ధిదారులు గుర్తించారనే ప్రచారం ఉంది. లబ్ధిదారుల ఎంపికకు కరెంటు బిల్లుకు.. సంబంధమేంటి పలువురు ప్రశ్నిస్తున్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రభుత్వం విపరీతంగా కరెంటు బిల్లులు వసూలు చేస్తోంది. ఈ బిల్లులను సాకుగా తీసుకుని సంక్షేమ పథకాల ఎంపికకు మోకాలడ్డుతోంది. ప్రభుత్వం చేసిన ఈ మోసపూరిత కుట్రలను లబ్ధిదారులు గుర్తించడంతో కానుకల పంపిణీకి ప్రభుత్వం తెరలేపిందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నోట్లు వెదజల్లి సాగించాలనుకున్న ఓట్ల వేట ఎంతవరకు సఫలీకృతం అవుతుందో వేచి చూడాల్సిందే.

> వచ్చే ఎన్నికల్లో మమ్మల్ని ఢీకొట్టే వాళ్లే లేరు.. ఐదేళ్లలో మేము ఎంతో చేశాం.. మళ్లీ అధికారం మాదే.. అంటూ ఇప్పటి వరకు అధికార పార్టీ కట్టుకున్న ఆశల మేడ బీటలు వారుతోంది. నవరత్నాల కృత్రిమ నగిషీ వెలవెలబోతోంది. సంక్షేమ రంగానికి పెద్దపీట వేశామంటూ చేస్తున్న ప్రచార మబ్బులు చెదిరిపోతున్నాయి.. 175 సీట్లకు 175 మావే అనే డాంబికం పలికిన చోటే గట్టెక్కేది ఎలా? అనే బేలతనం కనిపిస్తోంది. దీంతో నోరు తెరిస్తే.. విలువలతో కూడిన రాజకీయం చేస్తామని గొప్పలు చెప్పుకున్నవాళ్లే.. విలువలకు పాతరేసి గెలుపే లక్ష్యంగా అడ్డదారులు తొక్కుతున్నారు. విచ్చలవిడిగా.. డబ్బు వెదజల్లి.. విందు, వినోదాలతో యువతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని అధికార పార్టీ ముఖ్య నాయకులకు డబ్బు చేరిపోయింది.

రుణ ప్రణాళిక లక్ష్యాన్ని అధిగమించాలి

- జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలివ్వాలి : కలెక్టర్



రుణ ప్రణాళిక లక్ష్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బ్యాంకు మేనేజర్లు

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 12: జిల్లా వార్షిక ప్రణాళిక లక్ష్యాన్ని 2023-24 ఆర్థిక సంవత్సరంలో అధిగమించాలని, జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలివ్వాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో మూడవ త్రైమాసికం డిసెంబరు 31 నాటికి బ్యాంకులు సాధించిన ప్రగతిపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలు, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరులో బ్యాంకర్లు తమ లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో డిసెంబరు 31 మూడవ త్రైమాసికం చివరి నాటికి జిల్లాలో మొత్తం రూ.8636 కోట్లు లక్ష్యం కాగా, రూ.10,869 కోట్ల రుణాలు అందించి 126 శాతం ప్రగతి సాధించామన్నారు. అలాగే వ్యవసాయ రంగంలో రూ.6422 కోట్లు లక్ష్యం కాగా రూ.7662 కోట్ల మేర రైతులకు రుణాలు అందించి 119 శాతం, ప్రాధాన్యతా రంగంలో రూ.7633 కోట్లు లక్ష్యం కాగా రూ.8853 కోట్ల మేర రుణాలు అందించి 116 శాతం ప్రగతి సాధించామని తెలిపారు. అలాగే ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్‌లో భాగంగా 919 యూనిట్లకు లక్ష్యాన్ని మించి రూ.15.39 కోట్ల మేర రుణాలు అందించారన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు, ప్రోత్సహించడం కొరకు మూడవ త్రైమాసికం నాటికి 21,686 సూక్ష్మ చిన్న, మధ్య తరహా యూనిట్లకు రూ.946 కోట్లు రుణాలు అందించారని తెలిపారు. అలాగే ఇతర ప్రాధాన్యతా రంగాల్లో 13,090 యూనిట్లకు రూ.244.67 కోట్లు, డీఆర్‌డీఏ మెప్మా శాఖల ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 13,069 మహిళా సంఘాలకు రూ.1,191.83 కోట్లు రుణాలు అందించినట్లు తెలిపారు. మూడవ త్రైమాసికం ముగిసే నాటికి లక్ష్యాలను మించి రుణాలు అందించడంపై బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లతో కలిసి 2024-25 పొటెన్షియల్ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్‌బీఐ, యూనియన్, సప్తగిరి బ్యాంక్ ఆర్‌ఎంలు కేఎస్ఎస్ శర్మ, బి.భాస్కర్, జీఎంవీ ప్రసాద్, నాబార్డు ఏజీఎం విజయ్‌విహారి, వివిధ బ్యాంకర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 12: సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో స్వీప్ కార్యక్రమాలు, ఎంసీసీ, ఎంసీఎంసీ, ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్‌యాప్స్ తదితర అంశాలపై ఆర్వోలు, ఏఈఆర్వోలు, డీటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, తదితర ఎన్నికల సిబ్బందికి సంబంధిత నోడల్ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించిన డిప్యూటీ తహసీల్దార్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్నికల్లో కీలకపాత్ర పోషించబోతున్నారన్నారు. వీరందరూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించినప్పుడే ఎన్నికల ప్రక్రియ విజయవంతం అవుతుందన్నారు. స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి గురుప్రకాశ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి మద్దిలేటి, ఎన్నికల సిబ్బందికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియపై రాయచోటి ఆర్డీవో రంగస్వామి, భారత ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ అప్లికేషన్లపై సమాచార సాంకేతికత నోడల్ అధికారి హరికృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్డీవోలు గురుస్వామి, హరిప్రసాద్, మోహన్‌రావు, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి ధనలక్ష్మి, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సెహరీ (గురువారం ఉదయం)
రాయచోటి	6.30	5.03
మదనపల్లె	6.31	5.10
రాజంపేట	6.30	5.06
పీలేరు	6.29	5.08

టీడీపీ సీనియర్ కార్యకర్త దారుణ హత్య

- తుమ్మణంగుట్ట రైల్వేస్టేషన్ వద్ద దారుణం




దారుణ హత్యకు గురైన రాజారెడ్డి, రాజారెడ్డి (ఫైల్)

ములకలచెరువు, మార్చి 12: ముంబాయి-చెన్నై జాతీయ రహదారి పక్కనున్న తుమ్మణంగుట్ట రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి టీడీపీ సీనియర్ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు మండలం సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్దమరువపల్లెకు చెందిన దయ్యాల రాజారెడ్డి (55) టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు బ్రాహ్మణి, చిత్ర ఉన్నారు. మొదటి కుమార్తెకు వివాహం కాగా రెండో కుమార్తె చెన్నైలో చదువుకుంటోంది. జాతీయ రహదారి పక్కనున్న తన భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల క్రితం పొలంలోనే కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకున్నాడు. రోజూలాగే కోళ్ల ఫారం వద్ద రాత్రి రాజారెడ్డితో పాటు పెద్ద కూతురు, అల్లుడు బాలాజీ నిద్రించేందుకు వచ్చారు. రాత్రి 12 గంటల సమయంలో కూతురు, ఆమె భర్తలు పెద్దమరువపల్లెలోని ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో కోళ్లఫారంలో నిద్రిస్తున్న రాజారెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. 1.30 గంటల సమయంలో కూతురు, అల్లుడు తిరిగి కోళ్లఫారం వద్దకు రాగా రాజారెడ్డి రక్తపు మడుగులో ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హంతకుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం సంఘటనా స్థలంలో క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో వివరాలు సేకరించారు. హత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి కార్యకర్త మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ మధును కలిసి నిందితులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే సాయంత్రం స్వగ్రామంలో జరిగిన కార్యకర్త అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. మంగళవారం ఆయన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నారు. టీడీపీ కార్యకర్త హత్యతో తంబళ్లపల్లె నియోజకవర్గం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హత్యతో రాజకీయ కోణం ఉందేమోనని భావించగా చివరకు రాజకీయ కోణం లేదని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర

- రెండోరోజు పోటెత్తిన భక్తులు
- చాగలగుట్టపల్లెకు చేరుకున్న అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 12: అనంతపురం గంగమ్మ జాతరలో భాగంగా రెండోరోజు మైలు తిరుణాల అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా జాతరకు భక్తులు పోటెత్తారు. ఒకవైపు పోటెత్తిన భక్తులు, మరోవైపు చాందినీబండ్లు, కుంకుమబండ్లతో జాతర ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. మంగళవారం ఉదయం వరకు చాందినీ, కుంకుమబండ్ల ప్రదర్శన జరిగింది. కాగా జాతరలో జూదం యథేచ్ఛగా జరిగిందని చాలామంది భక్తులు వాపోయారు. భక్తులు మంగళవారం అమ్మవారికి బోనాలు, జంతుబలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి జబర్దస్త్ బృందంలోని సునామి సుధాకర్, కార్తీక్, వినోదిని, మోహన్, పవిత్ర చేసిన హాస్యవల్లరి అందరినీ అలరించింది. రాయచోటికి చెందిన డ్యాన్సర్లు సినిమా పాటలకు డ్యాన్స్ వేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు అమ్మవారు చాగలగుట్టపల్లెకు చేరుకోవడంతో జాతర ముగిసింది. కాగా జాతర సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి, రాజకీయ నాయకులు, అధికారులు మంగళవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రవీంద్రరాజు, చైర్మన్ మురికినాటి రెడ్డెయ్యలు వీఐపీలను సన్మానించి ప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు

చీటీల పేరుతో మోసం

- రూ.4 కోట్లకు పైగా స్కాం
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- న్యాయం చేయాలని డిమాండ్

మదనపల్లె, మార్చి 12: అధికార పార్టీకి చెందిన వీఎస్ఆర్ గ్రాండ్ అధినేత సుధాకర్‌రెడ్డి చీటీల పేరుతో రూ.4 కోట్లకు పైగా ఎగవేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మూడు రోజులుగా బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నారు. మదనపల్లె ఆర్థిక నేరాలకు అడ్డాగా మారుతోంది. అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం నుంచి మట్కా, జూదం, మోసాలు, ఐపీలు ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. పేద, మధ్యతరగతి వ్యక్తులు జూదం, మట్కాలు ఆడితే సమాజంలో పెద్దలుగా చెలామణి అయ్యే రాజకీయ నాయకులు మాత్రం ఆర్థిక మోసాలకు పాల్పడుతూ పేద, అమాయక ప్రజలను లూటీ చేస్తున్నారు. తమకున్న అధికారం, పలుకుబడి ఉపయోగించి ఆ నేరాలను సామాన్యులపైనో లేక ఎదుటి వ్యక్తులపైన వేసే ప్రయత్నం చేస్తున్నారు. మదనపల్లెలో తాజాగా వెలుగుచూసిన చీటీల స్కాం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రూ.వేలు.. రూ.లక్షలు కాదు..రూ.కోట్లు మోసం చేశారు. ఎన్నో ఆశలు, అవసరాల పేరుతో భవిష్యత్తు అవసరాల కోసం రూపాయి..రూపాయి కూడబెట్టిన ప్రజలు ఆ డబ్బును పరులపాలు చేశారు. ఏళ్ల తరబడి నమ్మకంగా ఉంటూ వేస్తున్న చీటీల నిర్వాహకులు చివరకు చేతులెత్తేయడంతో బాధితులంతా లబోదిబోమంటున్నారు. పాట పాడిన చీటీలకు సకాలంలో డబ్బులు ఇవ్వకుండా పదేపదే తిప్పుకుంటూ కాలయాపన చేస్తుండగా చివరకు బాధితులు చీటీల నిర్వాహకుల ఇంటి వద్దకే వెళ్లి నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తనకు సంబంధం లేదని ఒకరు చెబితే.. తనకూ ప్రమేయం లేదని మరొకరు చెప్పడం బాధితులను మరింత బాధిస్తోంది. దీంతో కజిన్స్‌వీధి చివరిలోని వీఎస్ఆర్ గ్రాండ్ అధినేత సుధాకర్‌రెడ్డి, ఆయన మేనేజర్‌గా చెబుతున్న కృష్ణారెడ్డిని బాధితులు నిలదీస్తున్నారు. వీరిద్దరూ ఒకరిపై మరొకరు వేసుకుంటుండగా కృష్ణారెడ్డితో కలిసి బాధితులు అటు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఇటు వన్‌టౌన్ పోలీసుల వద్దకు మూడు రోజులుగా పరుగులు తీస్తున్నారు. ఈ చీటీల స్కాం పట్టణంలో దావానలంలా వ్యాపించడంతో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 250 మంది బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కుతున్నారు. కదిరి రోడ్డులోని కజిన్స్‌వీధిలో వీఎస్ఆర్ గ్రాండ్ సుధాకర్‌రెడ్డి కొన్నేళ్లుగా పట్టణంలో చీటీలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఈయన వద్ద వందల మంది నమ్మకంగా చీటీలు వేస్తున్నారు. ఈయన వద్ద మేనేజర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి ఈ చీటీల వ్యవహారం చూస్తుండేవాడు. చీటీలు వేసిన వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి యజమాని సుధాకర్‌రెడ్డికి ఇచ్చేవాడినని, తనకు జీతం మాత్రమే ఇచ్చేవాడని చెబుతూ అటు చీటీల బాధితులకు, ఇటు పోలీసులకు కృష్ణారెడ్డి చెబుతున్నాడు. సుధాకర్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కృష్ణారెడ్డి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా వందమంది బాధితులు అటు డీఎస్పీని, ఇటు వన్‌టౌన్ సీఐ వలిబసును కలిసి ఫిర్యాదు చేశారు. మేమంతా కొన్నేళ్లుగా సుధాకర్‌రెడ్డిని చూసే చీటీలు వేస్తున్నామని, కృష్ణారెడ్డి అక్కడ పనిచేసేవాడేనని బాధితులు చెబుతున్నారు. నెలనెలా సుధాకర్‌రెడ్డి నివాసంలోనే చీటీలు పాడటం నుంచి అక్కడే చీటీలకు డబ్బులు చెల్లిస్తున్నామని బాధితులు వాపోతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం బాధితులు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ వలిబసుకు ఫిర్యాదు చేశారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేస్తామని సీఐ బాధితులకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో బాధితులు చెబుతున్నట్లు రూ.4 కోట్లు చెబుతుండగా, ఈ స్కాం రూ.6 కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. మదనపల్లెలో మునుపెన్నడూ జరగని విధంగా రూ.కోట్లలో చీటీల స్కాం బయటపడటం స్థానికంగా చర్చనీయాంశమైంది.



మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వలిబసుకు ఫిర్యాదు చేస్తున్న చీటీల బాధితులు

'జగన్' సాక్షిగా.. సచివాలయంలో...
వలంటీర్, అడ్మిన్ డిష్యుం.. డిష్యుం...

- సేవలకు దూరంగా.. వార్డు సచివాలయం
- ప్రశ్నించినందుకు వలంటీరుపై సచివాలయ అడ్మిన్ దాడి
- ప్రతిఘటించిన వలంటీర్

రాయచోటి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ముందుకే సేవలు అందించేందుకు.. వార్డు, గ్రామ సచివాలయాలు ప్రవేశపెట్టామని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. అయితే ఇందులో వాస్తవం లేదని, ప్రజలకు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలు నామమాత్రమేనని రుజువు చేసే సంఘటన రాయచోటిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు ఇలా.. రాయచోటి పట్టణం కొత్తపల్లెకు చెందిన మూడవ సచివాలయంలో అదేవీధికి చెందిన సాదిక్‌బాషా వార్డు వలంటీరుగా పనిచేస్తున్నాడు. తమ కుటుంబం రేషన్‌కార్డులో ఉన్న సభ్యుల్లో ఒకరి పేరు తొలగించమని సుమారు రెండు నెలలుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో ప్రతి వార్డు, గ్రామ వలంటీర్ అంటే.. ఒక ఎమ్మెల్యే అంత విలువ. అయితే రెండు నెలలుగా వలంటీరు తిరుగుతున్నా సచివాలయంలో పని జరగలేదు. పదేపదే సచివాలయ అడ్మిన్‌ను ఈ పని చేయమని అడుగుతున్నాడు.

ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ ఆ వలంటీరు సచివాలయంలోకి వెళ్లి అడ్మిన్ నందకుమార్‌ను ప్రశ్నించాడు. వలంటీర్‌ను అయిన తనకే పనిచేయకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటంటూ గట్టిగా నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి గురైన సచివాలయ అడ్మిన్ నందకుమార్ వలంటీర్‌ను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా వలంటీర్ సైతం ప్రతిఘటించి సచివాలయ అడ్మిన్ చొక్కా పట్టుకున్నాడు. అక్కడున్న సచివాలయ సిబ్బంది వచ్చి వారిద్దరినీ విడిపించారు. సచివాలయంలో నిలువెత్తు జగన్ ఫొటో సాక్షిగా ఈ డిష్యుం డిష్యుం జరగడం విశేషం. ఈ సంఘటనపై బాధిత వలంటీర్ రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో వలంటీరుపై సచివాలయ అడ్మిన్ దాడి చేసిన వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ సంఘటనను చూస్తే రాష్ట్రంలో సచివాలయాల పనితీరు తెలుస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



సచివాలయంలో జగన్ చిత్రపటం సాక్షిగా వలంటీర్‌పై దాడి చేస్తున్న అడ్మిన్



ప్రతిఘటిస్తున్న వలంటీర్, (ఇన్‌సెట్‌లో) సచివాలయం అడ్మిన్ దాడిలో గాయపడ్డ వలంటీర్

రాత్రికి రాత్రి పేదల స్థలాలు ఆక్రమణ

- కొత్తకోడూరులో వైసీపీ నేతలు ఆగడాలు
- అధికారులు హెచ్చరించినా పట్టించుకోని వైనం

రైల్వేకోడూరు, మార్చి 12: ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జా చేయడం అధికార వైసీపీ నేతలకు పరిపాటిగా మారింది. తాజాగా రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలోని కొత్తకోడూరులో ఖాళీగా ఉన్న స్థలాలను కొందరు అధికార పార్టీ నేతలు రాత్రికి రాత్రి ఆక్రమిస్తున్నారు. రాత్రి సమయంలో ముగ్గుపిండితో స్కెచ్చులు వేయడం ఉదయాన్నే ఈ జాగా నాది అంటూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014లో కొత్తకోడూరులో ఇందిరమ్మ-3 పథకం కింద పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి సుమారు 25 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 500 పైచిలుకు ఇంటి స్థలాలను పేదలకు పంపిణీ చేశారు. హౌసింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణాలు చేపట్టారు. దీంతో చాలా మంది ఇల్లు కట్టుకుని నివాసాలు ఉంటున్నారు. ఇదే స్థలంలో చాలా మంది ఇళ్ల కట్టుకోకపోవడం, బోగస్ పేర్లతో ఇంటి స్థలాలు ఉండడం, ఊరిలో లేని వారికి పట్టాలు ఇవ్వడం జరిగింది. అలాగే పాఠశాల, గ్రౌండు, పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, అంగన్‌వాడీ కేంద్రం తదితర వాటి కోసం స్థలాలు ఎంపిక చేశారు.

ఈ స్థలాలకు సంబంధించిన ఫైలు లేక పోవడంతో 2022లో స్థానిక రెవెన్యూ శాఖాధికారులు స్థలాను క్షుణ్ణంగా పరిశీలించి.. ఖాళీగా ఉన్న సుమారు 200 పట్టాలను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ స్థలాలపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటం... వచ్చే ఎన్నికల్లో అధికారంలో ఉంటామో లేదో అని భావించి కొందరు ఈ స్థలాలను కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. పేదల పేరు చెప్పి రాత్రికి రాత్రే స్కెచ్ వేసి ఉదయానికి పనులు చేపడుతున్నారు. ఖాళీ స్థలాలను చదును చేసి మట్టి, ఇసుక తదితర వాటిని తరలించారు. ఈ విషయం తెలిసిన స్థానిక రెవెన్యూశాఖాధికారులు అక్కడకు వెళ్లి హెచ్చరించినా ఆక్రమణదారులు ఖాతరు చేయడం లేదు. పనులు మాత్రం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కొత్తకోడూరులో పేదలకు కేటాయించిన స్థలాల ఆక్రమణలపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము.

-శివరాముడు, తహసీల్దార్, రైల్వేకోడూరు


కొత్తకోడూరులో ఖాళీగా ఉన్న స్థలాన్ని చదును చేసిన దృశ్యం


ఖాళీ స్థలాల చదును కోసం మట్టి తరలించిన దృశ్యం

గంగమ్మ హుండీ ఆదాయం రూ.18.96 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె మార్చి 12: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతరకు సంబంధించి రెండు రోజుల హుండీని లెక్కించగా రూ.18,96,057లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు తెలిపారు. దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ ఛైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, సర్పంచులు వెంకనారాయణ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యనమల రాజబాబు, ఆలయ కమిటీ మెంబర్ల ఆధ్వర్యంలో మంగళవారం హుండీని లెక్కించారు. టికెట్లు ఆదాయం రూ.7,21, 350, హుండీ ద్వారా రూ.11,74,707లతో పాటు బంగారు నగలు, వెండి నగలు వచ్చినట్లు ఆయన తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.2లక్షల ఎక్కువ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చెల్లు గంగాధర, రామయ్య, శ్రీనివాసులు, సురేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సమరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డి

చక్రాయపేట, మార్చి 12: గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళాన్ని దాతలు అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. అనంతపురం పట్టణం మారుతీనగర్‌కు చెందిన కడపల్లి శేషు, కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని మంగళవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డికి అందించారన్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందించారని తెలిపారు.

బైకు అదుపు తప్పి యువకుడు మృతి


వల్లూరి కిరణ్‌కుమార్ మృతదేహం

చెన్నూరు, మార్చి 12: మండలంలోని ఉప్పరపల్లె నుంచి పుష్పగిరికి వెళ్లే దారిలో కేసీ ఉప కాల్వ వద్ద బైకు అదుపు తప్పి వల్లూరి కిరణ్‌కుమార్ (22) అనే యువకుడు మృతి చెందాడు. సీఐ పార్థసారథి వివరాల మేరకు... శివాలపల్లెకు చెందిన కిరణ్‌కుమార్ సోమవారం రాత్రి తన సొంత పనుల నిమిత్తం చెన్నూరుకు వచ్చి శివాలపల్లెకు వెళ్లే క్రమంలో గ్రామ సమీపంలోని కేసీ ఉపకాల్వ వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు అతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 12: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, ఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతో పాటు రిజర్వు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల ఏర్పాట్లు పక్కాగా ఉండేటట్లు చూడాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాల పర్యవేక్షణపై చర్యలు చేపట్టాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన ఫారం-6 నుంచి 8 వరకు అన్ని పక్కాగా తనిఖీ చేసి జాబితా సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన విధులను పక్కాగా నిర్వహించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రతి ఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకొని ఎటువంటి చిన్నపొరపాటు కూడా జరగకుండా ఎన్నికలు నిర్వహించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఎఫ్‌వో శుభం, డీఆర్‌వో సత్యనారాయణ, నోడల్ అధికారులు, ఆర్‌వోలు పాల్గొన్నారు.

దంత వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నజీముద్దీన్


సమావేశంలో పాల్గొన్న డాక్టర్ నజీముద్దీన్

కడప (నాగరాజుపేట), మార్చి 12: దంత వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నజీముద్దీన్ ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలో ఆదివారం రాత్రి దంత వైద్యుల సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి దంత వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ షేక్ నజీముద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డెంటల్ సర్జన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గడ్డం రాజేష్ (కర్నూలు) ఈ ప్రతిపాదనను ఆమోదించారు. కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ సంతోష్ (నంద్యాల), ట్రెజరర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి (అనంతపురం), డాక్టర్ వసీమ్ (కర్నూలు), డాక్టర్ సందా ఆకాశ్ (గోకుల్ డెంటల్), డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

పశుగ్రాసం అగ్నికి ఆహుతి

- రూ. 2 లక్షల నష్టపోయామని బాధితుల ఆవేదన


కాలిపోయిన వేరుశనగ వామి

గాలివీడు, మార్చి 12: ఆకతాయిలు చేసిన పనులకు మూగజీవాల మేత అగ్నికి ఆహుతైంది. పశువుల మేత కోసం అహర్నిశలు కష్టపడి పోగు చేసుకున్న వేరుశనగవామి అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. వివరాల్లోకి వెళితే.... మండలంలోని నూలివీడు పంచాయతీ జిల్లావాండ్లపల్లెకు చెందిన నక్కల సుమిత్రమ్మ, మడక కృష్ణయ్యలు రబీ సీజన్‌లో బోరుబావి కింద 7 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. పంట వడుచుకున్న అనంతరం వేరుశనగ కట్టెను వామిగా అమర్చుకున్నారు. మంగళవారం సాయంత్రం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వేరుశనగ వామికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదయ్యింది. దీంతో దాదాపుగా రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వీరభద్రుడికి మహానైవేద్యం

- వైభవంగా రథోత్సవం

రాయచోటిటౌన్, మార్చి 12: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం, మహానైవేద్య ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం వీరభద్రాలయం ముందు భాగంలో పుంగనూరు వాస్తవ్యులు చిత్తూరి మఠాధిపతి విరూపాక్ష స్వామి శిష్యులు శ్రీమఠం రెడ్డి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిగుండం వేసి అందులో మొక్కుబడులు ఉన్న భక్తులు నిప్పులపై నడిచి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో రుద్రహోమాన్ని నిర్వహించారు. వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి సాయంత్రం 4 గంటల నుంచి కేరళ వాయిద్యం, టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చెక్కభజన భజన, కోలాటం కార్యక్రమాలతో పట్టణ పురవీధుల్లో రథంపై ఊరేగారు. మహానైవేద్య ఘట్టం అటహాసంగా జరిగింది. స్వామివారి నైవేద్యాన్ని కుప్పగా పోసి అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ఈనైవేద్యాన్ని తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.


రాయచోటి పురవీధుల్లో రథంపై స్వామి ఊరేగింపు


మహానైవేద్యాన్ని స్వీకరిస్తున్న భక్తులు

14 మందిపై కేసు నమోదు

కొండాపురం, మార్చి 12 : మురుగు నీరు విషయమై ఘర్షణపడిన ఘటనలో ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక రామసుబ్బారెడ్డి కాలనీలో మురుగు నీటి విషయమై నాగమ్మ అనే ఎస్సీ మహిళపై మల్కాపురం చెన్నమ్మ అనే మహిళతో పాటు మరో ఆరుగురు దాడి చేయగా వీరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అదే విధంగా తమపై కూడా దాడి చేశారని మల్కాపురం చెన్నమ్మ ఫిర్యాదు మేరకు.. నాగమ్మ మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

రామాపురం, మార్చి 12: మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ తూపల్లెలో మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రెలను అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గొర్రెల యజమాని వెంకట్రమణ తన కుటుంబ పోషణ కోసం అప్పు చేసి గొర్రెలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నాడు. ఇంటికి సమీపంలో కంచెను ఏర్పాటు చేసి రాత్రి సమయంలో గొర్రెల మందను తోలుకునేవాడు. మంగళవారం తెల్లవారు జామున ఒక్కసారిగా కుక్కలు గొర్రెల మందలో పడి దాడి చేశాయి. దీంతో 10 గొర్రెలు మృతి చెందగా.. మరో 10 గొర్రెలకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గొర్రెల మృతితో సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రామాపురం ఇన్‌చార్జి పశువైద్య అధికారి డాక్టర్ మహేశ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెలకు శవ పరీక్ష నిర్వహించారు. గొర్రెల యజమాని ఇన్సూరెన్స్ చేసుకొని ఉంటే బీమా వచ్చేదని డాక్టర్ తెలిపారు.

సీమ చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతి


ప్రథమ బహుమతి పొందిన చిత్రం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12: అనంతపురం రాయలసీమ సాంస్కృతిక వేదిక వేమన అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ పూర్వ విద్యార్థి గంపా మల్లయ్యకు రూ.ఐదు వేల విలువగల ప్రథమ బహుమతి లభించింది. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 118 మంది చిత్రకారులు 125 చిత్రాలను గీయగా, అందులో ఆయనకు ప్రథమ బహుమతి లభించింది. గాలెమ్మ ఊరేగింపు అనే కాన్సెప్ట్‌పై చిత్రలేఖనం గీశారు.

సమగ్ర శిక్ష కొత్త లోగో

समग्र शिक्षा
Samagra Shiksha

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12: విద్యామంత్రిత్వ శాఖ, పాఠశాల విద్య అక్షరాస్యత విభాగం సమగ్ర శిక్ష కొత్త లోగోను ఆమోదించినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని అధికారిక సంప్రదింపులు, కార్యక్రమాల్లో కొత్త లోగోను వినియోగించాలని అధికారులకు సూచించారు. 2018-19 విద్యాసంవత్సరంలో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం సమగ్ర శిక్ష పథకాన్ని ప్రారంభించిందన్నారు. పాఠశాల విద్యలో భాగంగా ప్రీ స్కూలు నుంచి 12వ తరగతి వరకు పిల్లలందరికీ సమానమైన సమ్మిళిత తరగతి గది, వాతావరణంలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడాలన్న లక్ష్యంతో ఈ పథకం పనిచేస్తుందన్నారు. విభిన్న నేపథ్యం, బహుభాషా అవసరాలు, విభిన్న విద్య సామర్థ్యాలు, అభ్యసన ప్రక్రియల్లో విద్యార్థులను చురుగ్గా పాల్గొనేలా సమగ్రశిక్ష కృషి చేస్తోందన్నారు. ఈ పథకం ఐదేళ్ల కాలానికి అంటే 2021-22 నుంచి 2025-26 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగిసిన గంగమ్మ తిరుణాల


కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

సికెదిన్నె, మార్చి 12: మండలంలో గంగమ్మ తిరుణాల ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు ఎంతో ఉత్సాహంగా సాగిన తిరుణాల భక్తుల కోలాహలం మధ్య మంగళవారంతో ముగిసింది. రెండవ రోజు అమ్మవారి సన్నిధిలో చెక్కభజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులకు కనువిందు చేశారు. దాతలు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు అందించి భక్తులకు సహకరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం... కాపాడిన పోలీసులు


వ్యక్తిని కాపాడి తీసుకెళుతున్న పోలీసులు

సిద్దవటం, మార్చి 12: మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో రైల్వే పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. మంగళవారం మధ్యాహ్నం భాకరాపేట సమీపంలోని రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఉండటం గమనించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, నాగరాజు సంఘటనా స్థలికి చేరుకుని రైల్వే పట్టాలపై ఉన్న వ్యక్తి వద్దకు వెళ్లి పరిశీలించారు. అతను రైలు కింద పడి చనిపోవాలనే ఉద్దేశ్యంతో విషద్రావణం తాగి ఉన్నట్లు గుర్తించారు. అతన్ని కాపాడి బంధువులకు సమాచారం ఇచ్చారు. మనస్థాపానికి గురికాకుండా నచ్చచెప్పి వెంటనే 108 అంబులెన్సులో కడప రిమ్స్‌కు పంపించారు. ఆ వ్యక్తికి ఎటువంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. ఇతను బద్వేలుకు చెందిన వెంకటసుబ్బయ్యగా గుర్తించామని.. కుటుంబ కలహాలు కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

బద్వేలు టౌన్, మార్చి 12: మున్సిపల్ పరిధిలోని నౌషాద్ థియేటరు సమీపంలో శ్రావణి (30) అనే మహిళ మంగళవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు 8 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. ఈమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై ఆందోళన

కడప (క్రైం), మార్చి 12 : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు స్పెన్సర్స్ వెనక వైపు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం పట్ల మంగళవారం కొంత మంది బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. వివరాలిలా.. నాగరాజుపేట గ్రామ పొలంలోని 20 సెంట్లు స్థలాన్ని కలెక్టరు విజయరామరాజు విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. అయితే ఇక్కడ కొంత మంది స్థానికులకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ స్థలాన్ని చదును చేసేందుకు విద్యుత్ అధికారులు రాగా పట్టాలు పొందిన కొంత మంది యంత్రాలను అడ్డుకున్నారు. తమకు సంబంధించిన ఇళ్ల పునాదులు మట్టి కింద ఉన్నాయని.. ఇటీవల మట్టి తోలడంతో కనిపించడం లేదని అధికారులకు తెలిపారు. ఇందుకు అధికారులు ఒప్పుకోకుండా మీ వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే కలెక్టరును కలవాలని తెలిపారు. చిన్నచౌకు పోలీసులకు విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేయగా వారు వచ్చిసమస్య ఉంటే ఉన్నతాధికారి వద్దకు వెళ్లాలని, పనులను అడ్డుకోవద్దని హెచ్చరించారు. బాధితులు తమ వద్ద కోర్టు స్టే ఆర్డరు కూడా ఉందని విద్యుత్ అధికారులకు తెలిపినప్పటికీ వారు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కలెక్టరు ఈ స్థలం కేటాయించారని చెప్పి యంత్రాలతో క్లీన్ చేశారు.


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

మా ఇంటిని కూల్చి సబ్‌స్టేషన్ కడుతున్నారు



గతంలో ఎమ్మార్వో డిఫారం ఇచ్చారు. 30 ఏళ్ల నుంచి గుంతలు పూడ్చుకుని ఇల్లు నిర్మించుకున్నా. మూడేళ్ల క్రితం వచ్చిన వర్షాల కారణంగా ఇళ్లు ఖాళీ చేసి బాడుగకు ఉన్నాం. అధికారులు 2021లో తమ ఇంటిని కూల్చారని.. అయితే తాము కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నప్పటికీ అధికారులు బెదిరిస్తున్నారు. ఇంటిపన్ను, కరెంటు బిల్లులు కూడా చెల్లించామని చెప్పినా ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసుకోమని చెబుతున్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలి.

-చంద్రమ్మ, బాధితురాలు

మద్యం సేవించి వాహనం నడిపినందుకు జైలు శిక్ష

రాయచోటిటౌన్, మార్చి12: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం రాయచోటి అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద తీర్పునిచ్చారు. వీరబల్లి మండలం కమ్మపల్లికి చెందిన వెంకట్రమణ కుమారుడు రామశేషన్న మంగళవారం మద్యం సేవించి రాయచోటి పట్టణంలో వాహనం నడపడంతో అతనిపై ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ శారద కేసును విచారించి మరోసారి ఇలాంటి తప్పు పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

కంటి చికిత్సకు ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, మార్చి12 : కంటి సమస్యతో బాధపడుతున్న సిబ్యాల సుబ్రహ్మణ్యం రాజు అనే వ్యక్తికి చికిత్స నిమిత్తం ముక్కా రూపా నందరెడ్డి ఫౌండేషన్ తరపున ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి మంగళవారం రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిలి పాపన్నగారి ప్రసాద్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సాయి శివ శంకర్‌రెడ్డి, ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాయచోటి అభివృద్ధి



12వ వార్డులో ప్రచారం చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



చిన్నమండెం: ఎన్నికల ప్రచారంలో మండిపల్లి సతీమణి హరితారెడ్డి

రాయచోటిటౌన్, మార్చి12: నియోజకవర్గ అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 11, 12వ వార్డుల్లో రవిహాల్, బేతల్‌కాలనీ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం 11, 12వ వార్డులకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా, కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 12వ వార్డుకు చెందిన బీసీ నాయకుడు నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి, మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.ఒక లక్ష ఆర్థిక సాయం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, జాఫర్‌వలి, డేవిడ్ రెడ్డి, చిట్టి, బాలురెడ్డి, మాజీ కౌన్సిలర్ రాంమోహన్‌రెడ్డి, మదన , మాజీ కౌన్సిలర్ వెంకటేశ్, డాక్టర్ కృష్ణయ్య, రమణ, రమేశ్, సురేంద్ర, ఆది, చంద్రమోహన్, రాజశేఖర్‌రాజు, అశోక్, కృష్ణంరాజు, రాజయ్య, షంషీర్, హర్షద్, అతావుల్లా పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం

చిన్నమండెం: మండలంలోని కలిబండ గ్రామ పంచాయతీలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి, కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజల మన్ననలు పొందే పేదల ప్రభుత్వం చంద్రబాబు సారథ్యంలో అతిత్వరలో కొలువు తీరుతుందని జోస్యం చెప్పారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అన్యాయాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో



రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య

సంబేపల్లె, మార్చి12: వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య సూచించారు. మంగళవారం సంబేపల్లె మండలం రౌతుకుంట గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2 కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రజల ముంగిటకే వచ్చి చికిత్స అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ పథకం ద్వారా ఉచితంగా చికిత్స నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటయ్యాయన్నారు. వివిధ వ్యాధుల నిర్ధారణకు ఆధునాతన ఎనలైజర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సుశిక్షితులైన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సేవలు అందిస్తారన్నారు. 300 మంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో నిర్మల కుమారి, సూపర్‌వైజర్లు సదాశివారెడ్డి, లక్ష్మీనారాయణ, రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ సాయిలీల, ఆరోగ్య కార్యకర్త మేహరీన్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బీజేపీ ఉచ్చులో పడరాదు: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రాజంపేట, మార్చి12 : రాజ్యాంగ విలువలు తెలియని బీజేపీ ఉచ్చులో ఎస్‌బీఐ పడొద్దని సీపీఐ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణ దేవర, సహాయ కార్యదర్శి ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమైనవని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గత నెల 15న తేల్చి చెప్పిందన్నారు. ఈ బాండ్లకు సంబంధిన వివరాలను మార్చి 6వ తేదీకి ఎన్నికల కమిషన్‌కు అందించాలని, ఆ వివరాలను ఎన్నికల కమిషన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా తమ వెబ్‌సైట్‌లో ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పాటించే ఉద్దేశం ఎస్‌బీఐ యాజమాన్యంలో ఏ కోశానా కనిపించక పోవడం చాలా దారుణమన్నారు. బీజేపీని నమ్ముకుంటే ముంచేయడం ఖాయమన్నారు. మోదీ ప్రభుత్వం 2017లో ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచే వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత వస్తూనే ఉందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు రాగానే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ ఖాతాలోకి 6500 కోట్ల పైగా విరాళాలు వచ్చాయని, దేశ సంపదను తాకట్టు పెట్టినందుకే అంతమొత్తంలో విరాళాలు అందాయన్నారు. ఈ విషయం బయట పడితే పారిశ్రామిక సంస్థల మీద కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని దర్యాప్తు సంస్థలతో దాడి చేయించి వారిని లొంగదీసుకొని ఎన్నికల నిధులు సమకూర్చుకున్న నరేంద్రమోదీ దుర్మార్గమైన చర్యలు ప్రజలకు తెలిసిపోతాయన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ విలువలు తెలియని బీజేపీ చేతుల్లో చిక్కుకుని ఎస్‌బీఐని ముంచొద్దని వారు కోరారు. ఈ ఎన్నికల బాండ్లను ఈ దేశంలో తిరస్కరించిన పార్టీలేవైనా ఉన్నాయంటే ఇవి కేవలం కమ్యూనిస్ట్ పార్టీలేనని వారు గుర్తు చేశారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర మహోత్సవం

మదనపల్లె అర్బన్, మార్చి 12: స్థానిక బుగ్గకాలువలో వెలసిన బాట గంగమ్మ జాతర మహోత్సవం రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొగ్గిటి అలివేలమ్మ తెలిపారు. ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి నాదేళ్లనారాయణ స్వామివీధి, వాల్మీకివీధి, బుగ్గకాలువ తదితర ప్రాంతాల నుంచి మహిళలు దీలు బోనాలు బాటగంగమ్మకు సమర్పించారు. బాట గంగమ్మను ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి విశేషపూజలు చేసి భక్తుల దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో అమ్మవారి భక్తులు పూజలో పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆలయం ఆవరణలో భక్తులకు అన్న దానం, అనంతరం సాయంత్రం ప్రత్యేక వాహనంలో పుష్ప అలంకరణలో అమ్మవారు ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ. ధర్మకర్త బొగ్గిటి అలివేలమ్మ తెలిపారు.

రెడ్డెమ్మ కొండకు రూ.18.40 లక్షలు ఆదాయం



రెడ్డెమ్మకొండలో తల నీలాలకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మార్చి 12:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో మంగళవారం నిర్వహించిన వేలం పాట ద్వారా అమ్మవారికి రూ.18.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. అమ్మవారికి మొక్కుగా భక్తులు సమర్పించే తలనీలాలకు వేలం నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన చెన్న కేశవ రూ.18.40 లక్షలకు హక్కులు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో అర్చకులు

గుర్రంకొండ, మార్చి 12:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం సుగంధద్రవ్యాలతో తయారు చేసిన ద్రవ్యాన్ని ఆలయమంతా చల్లి పూజలను చేశారు. ఉత్సవమూర్తులను ప్రత్యే కంగా అలంకరించి పూజలను చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభం

కురబలకోట, మార్చి 12: పవిత్ర రంజాన్ మాస ఉపవాసదీక్షలు మంగళ వారం ప్రారంభమయ్యా యి. ఆకాశంలో సోమవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వ డంతో రంజాన్ మాసం ప్రారంభ మైంది. కాగా ఈ ఉపవాస దీక్షల ను అత్యం కఠోరంగా నెల రోజుల పాటు ముస్లింలు ఆచరిస్తారు. వేకువజామున సహరీతో ఉపవాసదీక్షల ను ప్రారంభించి సాయంత్రం ఇఫ్తారీతో ఉపవాసదీక్షలను విరమిస్తారు. ఇందులో భాగంగా ముస్లింలు మసీదులలో నిర్వహించిన ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో మసీదులు కిటకిటలాడాయి.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మార్చి 12: మదనపల్లె ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ వివాహిత మంగళవారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. అంకిశెట్టిపల్లెకు చెందిన లాస్య(30) భర్త తీసుకొచ్చిన డబ్బుల్లో రూ.5లక్షలు తన స్నేహితుడికి అప్పుగా ఇచ్చింది. ఆ మొత్తం తిరిగి ఇవ్వమని స్నేహితుడిని కోరినా, అతను ఇవ్వకపోవడంతో కుటుంబీకులు మందలిస్తారేమో అని భయపడి స్థానిక ఆర్టీసీ బస్టాండు చేరుకుని ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించిం ది. గమనించిన స్థానికులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు తప్పవు

మదనపల్లె టౌన్, మార్చి 12: గ్రామ పంచాయతీ, పీకేఎం ఉడా అనుమతి లేకుండా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అక్రమ లేఅవట్లపై చర్యలు తప్పవని డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండంలోని రామాచారపల్లె, వలసపల్లె గ్రామ పంచాయతీల్లో వెలసిన అక్రమ లేఅవుట్లను డీఎల్‌పీవో పరిశీలించారు అక్రమ లేఅవుట్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని, వాటిలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయొద్దని సంబంధిత శాఖకు లేఖ రాస్తామన్నారు.

వేడుకగా పార్వేట ఉత్సవం



అశ్వవాహనంపై స్వామి, అమ్మవారు

కలకడ, మార్చి 12: కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పార్వేట ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలతో ప్రత్యేక వాహనంలో సత్యవతి నదిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అర్చకులు విజయసారథి, సుబ్రమణ్యం, మహేష్‌లు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కె.అఖిలేష్, మద్దిపట్ల వెంకట రమణనాయుడు, కోనేని రెడ్డెప్ప నాయుడు, రెడ్డెప్ప, మునిరాజ, నాగరాజు, మల్లికార్జున, రామయ్య చౌదరి, కుమార్‌నాయుడు తదిత రులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 12: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కారును మదనపల్లె ఎస్ఈబీ, డీటీఎఫ్ పోలీసులు మంగళవారం పట్టుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద వేగంగా వస్తున్న ఓ కారును ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆపి తనిఖీ చేయగా, 90 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. దీంతో కారును సీజ్ చేసి, కారు నడుపుతున్న మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన ఎ. వెంకట నారాయణ(50)ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మండలంలోని నారమాకుల తాండాలో ఎస్ఈబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అటవీప్రాంతంలో దాచి పెట్టిన 1950 లీటర్ల బెల్లం ఊటను కనుగొని ధ్వంసం చేశారు. నిందితుల కోసం వెతుకుతున్నామని సీఐ తెలిపారు.

సుగవాసిని కలిసిన ముదిరాజ్ నేతలు



సుగవాసి సుబ్రమణ్యంను సన్మానిస్తున్న ముదిరాజ్ సాధికార సమితి రాష్ట్ర, జిల్లా నేతలు

రాయచోటిటౌన్, మార్చి 12: రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా సుగవాసి బాల సుబ్రమణ్యంను ఖరారు చేయడంతో మంగళవారం ముదిరాజ్ సాధికార సమితి నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ముదిరాజ్ సాధికార సమితి సభ్యుడు మండ్ల రామాంజనేయులు, రాజంపేట పార్లమెంట్ కన్వీనర్ మూగి వెంకట్రమణ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు అమావాస్య రెడ్డెయ్య, తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన నాయకు లు ప్రకాశ్‌రెడ్డి, మస్తాన్, యువ నాయకులు రమేష్, సుదర్శన్ తదితరులు ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్ సమితి తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేస్తుందన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎద్దులు

నందలూరు, మార్చి 12 : మండలంలోని టంగుటూరులో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన బండ లాగుడు పోటీలను జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభించారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె రమేష్‌కు చెందిన ఎడ్లు మొదటి స్థానంలో, ప్రొద్దుటూరు భాస్కర్‌రెడ్డికి చెందిన ఎద్దులు రెండో స్థానంలో, నందలూరు షేక్ హబీబుల్లాకు చెందిన ఎడ్లు మూడో స్థానంలో, కడప రమణారెడ్డికి చెందిన ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలు వరుసగా రూ.50వేలు, 40, వేలు, రూ.30 వేలు, రూ20 వేలు నగదు బహుమతులు అందుకున్నారు. ఈ మొత్తాలను వరుసగా ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, చుక్కా వెంకటేశ్వరయ్య , బయనబోయిన భాస్కర్, గీతాల నరసింహారెడ్డి అందజేశారు. బయనబోయిన భాస్కర్ యాదవ్, గుజ్జల ఈశ్వరయ్య, మంచా మురహరి, మంచా ఫణీంద్ర పోటీలను పర్యవేక్షించారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్‌జహీర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పూర్వ ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ గుండె లాంటిది



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

పెనగలూరు, మార్చి 12 : పూర్వ ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ కేంద్రం గుండె లాంటిదని ఐసీడీఎస్ పెనగలూరు సెక్టారు సూపర్‌వైజర్ విజయ కుమారి, కొండూరు సెక్టారు సూపర్‌వైజర్ విశాలాక్షి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం కోడి చిన్నయ్య గారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త కె.విజయమ్మ అధ్యక్షతన తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్య అంటేనే ఆటపాటల విద్య అన్నారు. ఐదేళ్ల వయసులో చిన్నారులకు మెదడు అభివృద్ధి చెందుతుందని ఆ సమయంలో ఆటపాటల ద్వారా వారికి కల్పించే అవగాహన అలాగే గుర్తుండిపోతుందన్నారు. ఈ పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఐదేళ్ల వయసున్న చిన్నారులు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగంగా మంచి అవగాహన కలిగి ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్లు ఉమాదేవి, అరుణకుమారి, ప్రసన్నకుమారి, భాగ్యమ్మ, విజయలక్ష్మి, ఈశ్వరమ్మ, పద్మావతి, వసంత, శారద తదితరులు పాల్గొన్నారు.

కాలబైరవ స్వామి సన్నిధిలో కన్నడ భక్తులు



పూజలు చేస్తున్న కన్నడ భక్తులు

రాయచోటిటౌన్, మార్చి12: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయ చోటి మండల పరిధిలోని యండ పల్లె గ్రామం ముసలిరెడ్డిగారిపల్లె సమీపంలో భైరవగుట్టపై వెల సిన ప్రాచీన కాలబైరవ స్వామి సన్నిధిలో కన్నడ భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వారికి అవసరమైన వసతులను కల్పించారు. ఆలయ అర్చకులు కాలబైరవస్వామి దేవాలయం విశిష్టత, విశేషాలను వివరించారు.

విజయాన్ని చంద్రబాబుకు బహుమతిగా ఇస్తాం

● టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి



మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, మార్చి 12: ఎన్నికల్లో టీడీపీ విజయానికి ఢోకా లేదని, మంచి మెజార్టీ సాధిస్తామని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక విజయ కన్వెన్షన్ హాలులో మీడియాతో మాట్లాడారు. జనసేన, బీజేపీతో కలసి పని చేస్తామని తెలిపారు. నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. అభ్యర్థి ఎవరైనా విజయానికి పాటు పడతామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ నాటి నుంచి ప్రచారం ఉధృతంగా ఉంటుందన్నారు. జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, సీనియర్ నేత కస్తూరి విశ్వనాథనాయుడు, సూచనలు, సలహాలు పాటిస్తామన్నారు. తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినందుకు చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



సాత్విక్‌రాజ్

సుండుపల్లె, మార్చి12: రాష్ట్ర స్థాయి అబాకస్ జూని యర్ లెవెల్ పోటీల్లో తమ పాఠశాల మూడవ తరగతి విద్యార్థి సాత్విక్‌రాజ్ తృతీయ బహుమతి సాధించినట్లు చైతన్య, వశిష్ఠ విద్యాసంస్థ పాఠశాల కరస్పాండెంట్ రెడ్డెయ్యరాజు మంగళ వారం తెలిపారు. విద్యార్థి రాణించడంపై తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినం దనలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్ష

రాయచోటిటౌన్, మార్చి12: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 54 పరీక్షా కేంద్రాల్లో 16,799 మంది విద్యార్థులకు గానూ 15,754 మంది పరీక్షకు హాజరుకాగా 1045 మంది గైర్హాజరయ్యారు. రాయచోటి పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాల వద్ద డీఐఈవో కృష్ణయ్య హాల్ టికెట్లను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద బయట వ్యక్తులు ఎవరు కనిపించకూడదని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే డీవైఈవో కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్ అధికారులు, డిపార్టుమెంట్ అధికారులతో పాటు రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ రెండు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాల అధికారులు ప్రశాంత వాతావరణంలో పబ్లిక్ పరీక్షలు జరిగేలా పర్యవేక్షించారు. పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మకు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సిద్దవటం, మార్చి12 : మండలంలోని పెద్దపల్లి పంచాయతీలో కడప-చెన్నై రహదారి పక్కన వెలసిన ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం పూజలు చేశారు. అనంతపురం, కడప జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

పీలేరు, మార్చి 12: కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు పీలేరులో కార్ల మెకానిక్‌గా పనిచేస్తున్న రఫీ(46), తన సహాయకుడు అఫ్సర్(16)తో కలిసి తన సొంత కారు లో పీలేరు నుంచి కలకడకు వెళుతూ పొంతలచెరువు క్రాస్ వద్ద కలకడ నుంచి పీలేరుకు వస్తున్న మరో కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వారితో పాటు కలకడ నుంచి వస్తున్న కారులో ఉన్న శరవణ కుమార్(26)కు గాయాలయ్యాయి. రఫీ, అఫ్సర్‌లకు కాళ్లు విరిగిపోగా, శరవణకుమార్ తలకు దెబ్బలు తగిలాయి. వారిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రఫీని వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. శరవణ కుమార్, అఫ్సర్‌లను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




వేదికపై సంఘీభావం చాటుతున్న నాయకులు - సభకు హాజరైన జనం

మహానగరాలకు దీటుగా చిత్తూరు

● అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్న టీడీపీ అభ్యర్థి గురజాల

చిత్తూరు సిటీ, మార్చి 12: చిత్తూరును మహానగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు తనవద్ద ప్రత్యేక మ్యానిఫెస్టో ఉందన్నారు. చిత్తూరులోని పీవీకేఎస్ కళాశాల మైదానంలో మంగళవారం రాత్రి 12 నుంచి 26 డివిజన్ల ప్రజలతో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి వసతి, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తానని చెప్పారు. బీజేపీతో పొత్తు ఉండటంతో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తెచ్చుకోవడానికి వీలుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొర బాబు, సీనియర్ నేతల సలహాలను తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ప్రేమ, అభిమానంతో సీనియర్ నేతలకు తాను దగ్గరయ్యానని, ఇంత మందిని ఒకే వేదికపైకి తెచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి వచ్చే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఆపార్టీకి ఎందుకు ఓటు వేయాలో ప్రశ్నించాలని ఏఎస్ మనోహర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని ఏదో చెప్పాలని, మద్యనిషేధం ఎందుకు చేయలేదో వారిని నిలదీయాలన్నారు మంచి విజన్ ఉన్న గురజాల జగన్మోహన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలరన్నారు. కాగా, చిత్తూరు ఎంపీ టికెట్ ఆశిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావును ఈ సభలో పరిచయం చేశారు. కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, కోదండయాదవ్, గురజాల సందీప్, సుబ్బానాయుడు, వరుణ్‌కుమార్, గోళ్ల హేమాద్రి నాయుడు, సీఎం విజయ, అశోక్‌ఆనంద్ యాదవ్, వెంకటేష్ యాదవ్, వరలక్ష్మి, దుర్గాచౌదరి, దయారాం, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే ప్రకటించాలి



ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 12: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ప్రకటించాలని కోరుతూ మంగళవారం చిత్తూరులోని స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ ఎదుట సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశించినా, ఎస్బీఐ జాప్యం చేస్తూ గడువు పొడిగించాలంటూ పిటీషన్ దాఖలు చేయడం సరికాదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు పిటీషన్‌ను కొట్టివేస్తూ సరైన చర్య చేపట్టిందని వివరించారు. ఎన్నికల బాండ్ల వివరాలు సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ప్రకటిస్తే ఏ పార్టీకి ఎవరెవరు విరాళాలు ఇచ్చారో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు ఎస్.నాగరాజు, వీసీ గోపీనాథ్, రమాదేవి తదితరులు బ్యాంకు చీఫ్ మేనేజర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. దాసరి చంద్ర, రఘు, రాజ తదితరులు పాల్గొన్నారు.

మొగిలిలో బ్రహ్మ రథోత్సవం



మొగిలీశ్వరుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళ్యం, మార్చి 12: బంగారుపాళ్యం మండలం మొగిలిలో కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం బ్రహ్మ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్లకు అర్చకులు ప్రత్యేక పూజాభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అలంకరించి, బ్రహ్మరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు రథంపై మిరియాలు, బొరుగులు, పుష్పాలు చల్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు. రథదాత బెంగళూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ డెంటల్ విద్యాసంస్థల అధినేత నరసింహరాజు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

అబ్బురపరచిన ప్రదర్శనలు

● 'రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్' వీక్షణకు తరలివచ్చిన విద్యార్థులు



నమూనాలను వీక్షిస్తున్న విద్యార్థులు

గంగవరం, మార్చి 12: గంగవరంలోని మదర్ థెరీసా కళాశాలలో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో భాగంగా రెండో రోజైన మంగళవారం వివిధ జిల్లాల విద్యార్థులు 296 నమూనాలను ప్రదర్శించారు. ఈ నమూనాలు వీక్షకులను అబ్బురపరిచాయి. ఈ ప్రదర్శనను చూసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు భారీ గా వచ్చారు. నమూనాల తయారీ విధానం, ప్రయోగాలను వీక్షించారు. పంటలకు ఎరువుల పిచికారి, నీటి ఆదా, వాతావరణ కాలుష్య నివారణ, చేతిపనిముట్లతో ఆహార పదార్థాల తయారీ, బోర్లలో నీటి శాతం, సైకిల్ చక్రాలతో మట్టిని వేరుచేయడం, సేద్యంలో డ్రోన్ల వినియోగం, పంటలకు తక్కువ పెట్టుబడి విధానం తదితర నమూనాలను ప్రదర్శించారు. డీఈవో దేవరాజు, ఏపీవో వెంకటరమణరెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్‌వో రమణ, ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, మునెప్పమొదలి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, మార్చి 12: చంద్రగిరి సమీపంలోని భాకరాపేట అటవీప్రాంతంలో గొడ్డళ్ల, రంపాలతో చొరబడుతున్న ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఏఆర్ ఎస్ఐ మహేశ్వర నాయుడు టీమ్ భాకరాపేట అనంతపురం హైవేలోని ఓ ప్రైవేటు కాలేజ్ ఎదురుగా ఉన్న అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొందరు వ్యక్తులు అడవుల్లోకి చొరబడుతుండగా చుట్టుముట్టారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా, ఆరుగురిని పట్టుకున్నారు. వీరిని సత్యసాయి జిల్లాకు చెందిన ఆనేవాళ్ళ హరి (43), తిరుపతి రూరల్‌కు చెందిన మురుగయ్య (27), తమిళనాడు కళ్లకురిచ్చికి చెందిన వేల్ మురుగన్ (46), ఏలుమలై (46), మురుగన్ తంగవేల్ (37), మహేంద్రన్ మురుగేషన్ (46)లుగా గుర్తించారు. తప్పించుకున్న మరో ఆరుగురు కోసం గాలిస్తున్నారు. పట్టుబడ్డ వారి నుంచి మూడు బస్తాల్లో గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేయగా సీఐ శ్రీనివాసులు దర్యాప్తుచేస్తున్నారు.

వేడుకగా కొండచుట్టు

ఉత్సవర్ల వెంట భక్తజనం



● దేవతాగణాలకు ఆదిదంపతుల వీడ్కోలు ● కైలాసగిరుల చుట్టూ భక్తుల కోలాహలం

శ్రీకాళహస్తి, మార్చి 12: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం ఋషి రాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కొండచుట్టు వేడుకగా జరిగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలకు, ఋషులకు ఆదిదంపతులు వీడ్కోలుతో కృతజ్ఞతలు తెలిపారు.ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి చప్పరాలపై గిరిప్రదక్షిణకు తీసుకెళ్లారు. భేరివారి మండపం వద్ద భేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం జయరామారావు వీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగు గంగ, కైలాసగిరి, రాజీవ్ నగర్ కాలనీ, పనసకోనల మీదుగా గిరిప్రదక్షిణ సాగింది. రామాపురం రిజర్వాయరు ఎదురుగా ఉన్న అంజూరు మండపం వద్ద కాసేపు విశ్రాంతి కోసం కొలువుదీర్చి పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. అంజూరు మండపం నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం, భైరవ ఎస్టీకాలనీ, తుఫాన్ సెంటర్ మీదుగా శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపానికి స్వామి అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు భక్తిపూర్వకంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రాత్రి ముక్కంటి ఆలయానికి తీసుకువచ్చారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వవాహనంపై, జ్ఞానప్రసూనాంబదేవి సింహవాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు.ఉభయదారులుగా ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, ఆయన కుటుంబం, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, విజయవాడ కనదుర్గమ్మ ఆలయ ఈవో రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అశ్వ,సింహవాహనాలపై ఆదిదంపతుల విహారం



ఎదురుసేవ మండపంలో హారతి

శ్రీపాద సేవకుల మొరాయింపుతో గిరి ప్రదక్షిణ ఆలస్యం

కైలాసగిరి ప్రదక్షిణ ఊరేగింపులో శ్రీపాద సేవకులు మొరాయించడంతో ఉత్సవం రెండు గంటలు ఆలస్యంగా సాగింది. సోమవారం రాత్రి పట్టణంలో ఒకరు చనిపోవడంతో మంగళవారం ఉదయం చతుర్మాడ వీధుల సంప్రోక్షణ ఆలస్యమైంది. దాంతో కొంత ఆలస్యంగా ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు బయలుదేరారు. శ్రీ పాద సేవకుల్లోని ముగ్గురు పట్టణంలోని తెట్టు వద్ద మద్యం సీసాలు కొనుగోలు చేశారు. వాటిని తీసుకొని కైలాసగిరి ప్రదక్షిణకు ఒకే ద్విచక్ర వాహనంపై బయల్దేరారు.శీతలాంబ ఆలయం పక్కన ఉన్న తొట్టంబేడు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ట్రిపుల్ రైడింగ్, 7 మద్యం సీసాలతో పోలీసులకు పట్టుబడ్డారు.ఈ విషయం తెలిసి మా మనుషుల్నే పట్టుకుంటారా అంటూ గిరిప్రదక్షిణలో దేవుని మోస్తున్న శ్రీపాద సేవకులు కాసేపు మొరాయించారు. ఓ ఆలయ అధికారి, వైసీపీ నాయకుడు మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆ తర్వాత 12 గంటలకు అంజూరు వారి మండపం వద్దకు చేరుకోవాల్సి ఉండగా 2 గంటల ఆలస్యంగా ఉత్సవర్లు అక్కడికి చేరుకున్నారు.మామూలుగా అంజూరు వారి మండపం వద్ద నుంచి శ్రీపాద సేవకులు ముందున్నవారు వెనక్కు... వెనుక వారు ముందుకు మారాల్సి ఉంటుంది. అయితే ముందున్న వారు వెనక్కు వెళ్లబోమనడంతో శ్రీపాద సేవకుల మధ్య మళ్లీ వాగ్వాదం నడిచింది. దాంతో మళ్లీ అక్కడ కాసేపు ఆలస్యం చోటు చేసుకుంది.శుక బ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురు సేవ మండపం వద్దకు 5 గంటలకు రావాల్సిన స్వామి అమ్మవారు సాయంత్రం 7:30 గంటలకు చేరుకున్నారు.

నేడు వసంతోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాల్లో బుధవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఉదయం పురవీధుల ఉత్సవం పూర్తయ్యాక ఉత్సవమూర్తులకు తిరుమంజన గోపురం సమీపంలోని వసంత మండపానికి తీసుకెళ్లి వసంతోత్సవాలను నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. రాత్రి మేరు పర్వత సింహాసనంపై స్వామి వారు, కామధేనువుపై అమ్మవారు ఆసీనులై పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.

మద్యం గ్లాసులు, ఎముకలతో ఆర్టీసీ బస్సులు

చెక్‌పాయింట్ ఎలా దాటాయ్?

అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపిన తాజా ఘటన



తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పసిబిడ్డల పాల సీసాలు కూడా కొండపైకి అనుమతించరే... అలాంటిది మద్యం గ్లాసులు, ఎముకలున్న బస్సులు మాత్రం పదుల సంఖ్యలో కొండపైకి ఎలా చేరుకున్నాయి?.... వైసీపీ సిద్ధం సభకు వెళ్ళిన తిరుమల డిపో ఆర్టీసీ బస్సులు వైసీపీ టోపీలతో పాటు మద్యం గ్లాసులు, మాంసం తినగా మిగిలిన ఎముకలతో కొండపైకి చేరుకున్న ఉదంతం మీడియాలో చూసిన పలువురి నోట వినిపిస్తున్న ప్రశ్న ఇది. తిరుమల ఆర్టీసీ డిపో బస్సులైనంత మాత్రాన వాటికి అలిపిరి చెక్ పాయింట్‌లో మినహాయింపులేమీ వుండవు. ఇతర వాహనాలను తనిఖీ చేసిన రీతిలోనే సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశాకే కొండపైకి అనుమతించాల్సి వుంది. ఈ డిపో నుంచీ మొత్తం 40 బస్సులను సిద్ధం సభకు కేటాయించగా అవి తిరిగొచ్చాక ఒకదాన్ని కూడా అలిపిరిలో చెక్ చేయలేదని సమాచారం. పదుల సంఖ్యలో బస్సుల్లో వైసీపీ టోపీలు, మద్యం గ్లాసులు, ఖాళీ బిరియానీ ప్యాకెట్లు, బిరియానీ తినగా మిగిలిన ఎముకలు సీట్ల కింద పడి వున్నాయి. ఈ ఘటన అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.

తప్పిదం ఆర్టీసీపైకి నెట్టేసే యత్నం: తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో నిషేధిత, అవాంఛనీయ వస్తువులతో కొండపైకి చేరుకున్న వ్యవహారంలో తప్పిదాన్ని ఆర్టీసీ సిబ్బందిపైకి నెట్టేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ సభకు జనాన్ని తరలించే డ్యూటీ అయినా లేక కేటాయించిన రూటులో ప్రయాణీకులను తరలించే డ్యూటీ అయినా ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లు తమకు నిర్దేశించిన విధులు మాత్రమే నిర్వర్తిస్తారు. అంతేకానీ బస్సుల శుభ్రత వారి డ్యూటీ కాదు. బస్సు గ్యారేజీకి చేరాక అక్కడి సిబ్బంది బస్సులను శుభ్రపరుస్తారు. తిరుమలకు వెళ్ళే బస్సుల్లో నిషేధిత వస్తువులు లేకుండా చూడాల్సిన బాధ్యత డ్రైవరు, కండక్టర్లపై కూడా వుంది. అయితే ఆ విషయంలో ఆ బాధ్యత వారిమీద కన్నా అలిపిరి టోల్‌గేట్ సెక్యూరిటీ సిబ్బందిపై ఎక్కువగా వుంటుంది. ఆర్టీసీ బస్సా లేక ప్రైవేటు వాహనాలా అన్నదానితో నిమిత్తం లేకుండా ప్రతి వాహనం తనిఖీ చేసి పంపాల్సిన బాధ్యత సెక్యూరిటీ సిబ్బందిది. ఆ విధుల్లో వారు ఘోరంగా విఫలమైనట్టు సోమవారం నాటి ఘటన తేటతెల్లం చేస్తోంది. టీటీడీ సెక్యూరిటీ విభాగం వైఫల్యాన్ని కప్పిపెట్టి ఆర్టీసీపరంగా విచారణకు ఆదేశించడం, ఆర్టీసీ డ్రైవర్లపై చర్యలకు ఉపక్రమించడం విమర్శలకు దారి తీస్తోంది. వైసీపీ టోపీ, మద్యం గ్లాసులు, బిరియానీ ప్యాకెట్లు, ఎముకలు వంటి నిషేధిత వస్తువులే కానీ తిరుమల భద్రతకు ప్రమాదకరమేమీ కాదు. వాటివల్ల కొండ పవిత్రత దెబ్బతింటుందే కానీ ఎవరికీ ప్రమాదకరం కాదు. ఇదే ఆర్టీసీ బస్సుల్లో పై వస్తువులు కాకుండా ఉగ్రవాదులు పేలుడు పదార్థాలు వంటివి తరలించే వుంటే పరిస్థితి ఏమిటన్నది పలువురి ప్రశ్న. ఈ కోణంలో ఆలోచిస్తే అలిపిరి చెక్ పాయింట్ డొల్లతనం ఏమిటో జనానికి సులువుగా అర్థమవుతుంది.

చెక్ పాయింట్‌లో సామాన్య భక్తులకు చుక్కలు

అధికార ఆర్భాటం, పలుకుబడి కలిగిన వారి సంగతి పక్కన పెడితే సామాన్యులు అలిపిరి చెక్ పాయింట్ దాటాలంటూ దేవుడి కంటే ముందు చుక్కలు చూస్తారన్న సామెత వుంది. బస్సులు, జీపుల్లో కొండపైకి వెళ్ళే సాధారణ యాత్రికులు అలిపిరి టోల్ గేట్ చెక్ పాయింట్ వద్ద కనీసం నీళ్ళ బాటిళ్ళను తీసుకెళ్లే పరిస్థితి లేదు. కొండపైన టీటీడీ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించడంతో అలిపిరి చెక్ పాయింట్‌లో ప్లాస్టిక్ బాటిళ్ళను అనుమతించడం లేదు. బస్సుల్లో, జీపుల్లో వెళ్ళే వారు తమకు చిన్న పిల్లలున్నారని, మధ్యలో దాహమైనా, ఆకలైనా ఇబ్బంది పడతామని కాళ్ళావేళ్ళా పడినా చెక్‌పాయింట్ సెక్యూరిటీ సిబ్బంది ససేమిరా అంటారని నీళ్ళ బాటిళ్ళు, పాల సీసాలను లాక్కుంటారని పెద్ద పేరుంది. కొంత మంది సామాన్య యాత్రికులు కొండపైన కాటేజీల్లో వేడి నీటితో స్నానం చేసేందుకు గీజర్లు వెంట తీసుకుపోవడం పరిపాటి. అలాంటివి కూడా సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా అడ్డుకుంటుంటారు. జీపులు, కార్లు, బస్సుల్లో వచ్చే యాత్రికులు చెక్ పాయింట్‌లో ఖచ్చితంగా కిందకు దిగాల్సిందే. లగేజీ మొత్తం కిందకు దింపాల్సిందే. తమతో పాటు, లగేజీని కూడా సెక్యూరిటీ స్కాన్ చేయించుకున్నాకే చెక్ పాయింట్ దాటి తిరిగి వాహనాలు ఎక్కాల్సి వుంటుంది. యాత్రికులు దిగి లగేజీ కిందకు దింపేశాక ఖాళీ జీపులు, కార్లు, బస్సులను సెక్యూరిటీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుంది. సీట్ల కింద, సీట్ల వెనుక కవర్లు, డ్యాష్ బోర్డు, బోనెట్ లోపల కూడా తనిఖీ చేయాలి. బస్సులైతే ఫస్ట్ ఎయిడ్ కిట్ మొదలుకుని బోనెట్ లోపల, బస్సు ముందూ వెనుకా నేమ్ బోర్డు బాక్సులు కూడా తనిఖీ చేయాలి. డ్రైవర్, కండక్టర్లను కూడా చెక్ చేయాల్సి వుంటుంది. జీపులు, కార్లు, కిందకు దిగిన సామాన్య యాత్రికులను తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది బస్సుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వుంటున్నారనే ఆరోపణలున్నాయి. దూర ప్రాంతాల నుంచీ యాత్రికులు జీపులు, కార్లు అద్దెకు తీసుకుని వస్తుంటారు. తిరుమల వచ్చే అద్దె వాహనాల డ్రైవర్లకు కొండపై నిబంధనలు తెలియదు. ఆ కారణంగా వాహనాల్లో ఇతర మతాలకు చెందిన చిన్నపాటి చిహ్నాలు, వస్తువులూ వున్నా తెలియక టోల్ గేట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆయా వస్తువులను, చిహ్నాలను తొలగించి కొండపైకి వాహనాలను అనుమతించాల్సిన చెక్ పాయింట్ సిబ్బంది దానికి బదులు వాహన డ్రైవర్‌ను గంటల కొద్దీ నిర్బంధించడం, ఉగ్రవాదులను విచారించే రీతిలో ప్రశ్నించడం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

చెక్ పాయింట్‌లో కొన్ని వర్గాలకు మినహాయింపు

టీటీడీ ఉద్యోగులు, తిరుమల స్థానికులు చెక్ పాయింట్‌లో కిందకు దిగకుండా బస్సుల్లోనే కూర్చుని వుంటారన్న ఆరోపణలున్నాయి. వారిలో కొందరు కొండపైకి అక్రమంగా మద్యం, మాంసం వంటివి తీసుకెళ్ళడం సర్వసాధారణమని సమాచారం. బస్సులోకి సెక్యూరిటీ సిబ్బంది ఎక్కి వీరిని ప్రశ్నిస్తే టీటీడీ ఉద్యోగులు తాము స్టాఫ్ అని ఐడీ కార్డులు చూపడం, తిరుమల స్థానికులు తాము లోకల్ అని చెప్పడంతోనే సిబ్బంది మారుమాటాడకుండా బస్సు దిగేస్తుంటారన్న విమర్శలున్నాయి. కొండపైకి మద్యం తీసుకెళ్ళే వారు అక్కడ రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని సమాచారం. అదే విధంగా కొండపై వ్యాపారులు, స్థానికుల్లో పలువురు సాయంత్రం తిరుపతికి వచ్చి మద్యం సేవించి రాత్రికి తిరిగి కొండకు వెళ్ళడానికి అలవాటు పడ్డారు. కొందరు రోజూ ఇలాచేస్తుండగా, మరికొందరు వారానికి ఒకటి రెండు సార్లు వచ్చి వెళుతుంటారు. ఇలాంటి వారు మద్యం సేవించి బస్సులు, జీపుల్లో వెళుతున్నా అలిపిరి చెక్‌పాయింట్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. రోజూ రాత్రి 7-10 గంటల నడుమ ఇలాంటి వారు పెద్దసంఖ్యలో తిరుమల వెళుతుంటారు. ఖరీదైన కార్లు, పలుకుబడి కలిగిన వారి వాహనాలను సెక్యూరిటీ సిబ్బంది కన్నెత్తి కూడా చూడరని, వచ్చిన వాహనాన్ని వచ్చినట్టే చెక్‌పాయింట్ దాటిస్తారన్న పేరుంది. సామాన్యుల విషయంలో పాల బాటిళ్ళు, నీళ్ళ బాటిళ్ళు కూడా అనుమతించని సిబ్బంది పలుకుబడి కలిగిన వారు హెయిర్ డ్రైయర్లు, ఐరన్ బాక్సులు వంటివి తీసుకెళుతున్నా పట్టించుకోరన్న విమర్శలున్నాయి. తాజా ఘటనతోనైనా టీటీడీ యంత్రాంగం మేలుకొని అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా వైఫల్యాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరముంది. దీనికి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరముంది.

కొండ బస్సుల్లో నిషేధాల తరలింపుపై విచారణ!

తిరుపతి అర్బన్, మార్చి 12: వైసీపీ సిద్ధం సభకు జనాన్ని తీసుకెళ్లిన బస్సులు నిషేధితపదార్థాలతో తిరుమలకు చేరిన సంఘటనపై ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తిరుమల పవిత్రత దెబ్బతినేలా వ్యవహరించారంటూ డిపో మేనేజర్‌స్థాయి అధికారితో విచారణచేపట్టి నివేదిక ఇవ్వాలనికోరారు. సభ నుంచి తిరుగుముఖం పట్టిన సమయంలోనే డ్రైవర్లకు తిరుపతిలోనే బస్సులను శుభ్రం చేసి కొండకు తీసుకురావాలని ఫోన్ ద్వారా తిరుమల డిపో మేనేజర్ సూచించారు.అయినా పట్టించుకోకుండా బస్సులను తిరుమలకు తెచ్చిన డ్రైవర్లను సమగ్రంగా విచారించనున్నారు.ఈ ఘటనతో తిరుమల ఘాట్‌లో నడిచే సప్తగిరి బస్సులను ఇకపై ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల ప్రయాణాలకు మినహా ఇతర కార్యక్రమాలకు, ప్రధానంగా రాజకీయ ప్రచారాలకు ఉపయోగించకూడదన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 64,802 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,695 మంది తలనీలాలు సమర్పించారు.

కారుతో పాటు కర్ణాటక మద్యం పట్టివేత..వ్యక్తి అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 12: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కారును మదనపల్లె ఎస్‌ఈబీ, డీటీఎఫ్ పోలీసులు పట్టుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. మంగళవారం బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మదనపల్లె మండలం ఈశ్వరమ్మకాలనికి చెందిన ఎ. వెంకట నారాయణ(50) ఓ కారులో వేగంగా వస్తుండటంతో చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఈబీ పోలీసులు కారును ఆపి తనిఖీ చేయగా అందులో 90 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. దీంతో కారును సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చూపి రిమాండుకు తరలించారు. అలాగే మదనపల్లె మండలంలోని నారమాకుల తాండాలో ఎస్‌ఈబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అటవీప్రాంతంలో దాచి పెట్టిన 1950 లీటర్ల బెల్లం ఊటను కనుగొని ధ్వంసం చేశారు. నిందితుల కోసం ఆచూకి తీస్తున్నామని సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

పీలేరు, మార్చి 12: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మంగళవారం పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ పొంతలచెరువు క్రాస్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు పీలేరులోని కార్ల మెకానిక్‌గా పనిచేస్తున్న రఫీ(46), తన సహాయకుడు అప్సర్(16)తో కలిసి మరో కారు మరమ్మతుల నిమిత్తం తన సొంత కారులో పీలేరు నుంచి కలకడకు బయలుదేరాడు. మార్గమధ్యంలో పొంతలచెరువు క్రాస్ వద్ద కలకడ నుంచి పీలేరుకు వస్తున్న మరో కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రఫీ, అప్సర్‌తో పాటు కలకడ నుంచి వస్తున్న కారులో ఉన్న శరవణ కుమార్(26) గాయాలయ్యాయి. రఫీ, అప్సర్‌లకు కాళ్లు విరిగిపోగా, శరవణకుమార్ తలకు దెబ్బలు తగిలాయి. వారిని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం రఫీని వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. శరవణ కుమార్, అప్సర్‌లను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మార్చి 12: మదనపల్లె ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ వివాహిత మంగళవారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లెకు చెందిన లాస్య(30) భర్త తీసుకొచ్చిన డబ్బుల్లో రూ.5లక్షలు తన స్నేహితుడికి అప్పుగా ఇచ్చింది. ఈ క్రమంలో ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వమని స్నేహితుడిని కోరింది. అతను ఇవ్వకపోవడం కుటుంబీకులు మందలిస్తారేమో అని భయపడి స్థానిక ఆర్టీసీ బస్టాండు చేరుకుని ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వేలం పాట ద్వారా రూ.18.40 లక్షలు ఆదాయం


రెడ్డెమ్మకొండలో తలనీలాల వేలం పాటలను నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మార్చి 12: గుర్రంకొండ మండలం చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో మంగళవారం దేవదాయశాఖ అధికారులు నిర్వహించిన వేలం పాట ద్వారా అమ్మవారికి రూ.18.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ అధికారి రవి కుమార్ తెలిపారు. అమ్మవారికి మొక్కుగా భక్తులు సమర్పించే తల నీలాలకు వేలం పాటను నిర్వహించారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవ తలనీలాల వేలంను రూ.18.40 లక్షలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ వస్తూనే 20 లక్షల ఉద్యోగాలు

● పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


పీలేరు మండలం ముదుపులవేములలో ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, మార్చి 12: టీడీపీ అధికారంలోకి వస్తూనే రాష్ట్రంలోని యువత కోసం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం ఖాయమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలం ముదుపులవేముల పంచాయతీలో మంగళవారం ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యువతతో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సుమారు 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసే ప్రణాళిక ఉందని వెల్లడించారు. ఉద్యోగాలు వచ్చే వరకు రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. 2014-19 వరకు ముఖ్యమంత్రిగా ఉండగా చంద్రబాబు నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాపై ప్రత్యేక అభిమానంతో జిల్లాను మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దారనాన్నరు. ఆయన చొరవతోనే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు సత్యవేడు, తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని వేలాది మంది స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని గుర్తు చేశారు. మరలా అదే స్ఫూర్తితో మరిన్ని సంస్థలను తీసుకురావడమే కాకుండా గతంలో ఒప్పందాలు చేసుకుని జగన్ సర్కారు వేధింపుల వల్ల వెనక్కు వెళ్లిపోయిన సంస్థలతో మాట్లాడి వారిని పిలిపిస్తామన్నారు. తద్వారా భవిష్యత్తులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేక ఉపాధి అవకాశాలు ఏర్పడి స్థానిక యువత జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరిస్తాయన్నారు. పాదయాత్రలో రాష్ట్రంలోని యువతకు అనేక హామీలు గుప్పించిన జగన్, అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అనంతరం ఆయన ఇంటింటా కరపత్రాలు పంచుతూ టీడీపీ పథకాలను యువత, మహిళలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కాగా ముదుపులవేముల గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జి.నాగవేణి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లవోలు హేమచంద్రా రెడ్డి, సీవీ రెడ్డి, అబ్బు, అప్పస్వామి, భాస్కర, హరి, సురేంద్ర, శ్రీనివాసులు, మల్లికార్జున రెడ్డి, ఊటుకూరి శివా, చంద్ర, శంకర, జనసేన నాయకులు కలప రవి, గజేంద్ర, రెడ్డప్ప, మోహనకృష్ణ, పవన్, నవీన్, హరీశ్, గౌస్‌బాషా, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటాం

కలికిరి, మార్చి 12: ముస్లిం మైనారిటీలందరికీ టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి హామీ ఇచ్చారు. అంతేగాకుండా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన రంజాన్ తోఫా, దల్హన్, మైనారిటీ బిడ్డల విదేశీ విద్యలాంటి పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని చెప్పారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి మంగళవారం తనూజా రెడ్డి కలికిరి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మైనారిటీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామని, రాజకీయంగా, సామాజికంగా ముస్లింలకు ఎలాంటి కొరత రానివ్వకుండా చూస్తామన్నారు. చంద్రబాబు ముస్లింలకు అభివృద్ధికి కట్టుబడి పనిచేశారని, 2014లో బీజేపీతో పొత్తు వున్నా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకున్నారని గుర్తు చేశారు. పట్టణంలోని మసీదు వీధి, కోటవీధి, ఆర్ఎస్ రోడ్డు, బ్రాహ్మణవీధి, కొత్తపేట వీధి, టీబీ రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజి ఏరియాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కలికిరి ఎంపీటీసీ గాయత్రి, సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ముస్తఫా, అన్సర్, అఫ్రోజ్, సమీవుల్లా, ఏఎంసీ బుజ్జి, వైజాగ్ బాషా, మున్వర్, జనసేన అస్లామ్, రాజా రెడ్డి, తిప్పారెడ్డి, విజయకుమార్ రెడ్డి, రాజేష్, రాంబాబు, వర్మ, రమేష్ చెట్టి, ఏసురాజు, శ్రీమన్నారాయణ రెడ్డి, సహదేవ రెడ్డి, ఉత్తన్న, లేపాక్షి అస్లాం తదితరులు పాల్గొన్నారు.


కలికిరిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న తనూజా రెడ్డి

సంఘ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న చలపతి, తదితరులు

నిమ్మనపల్లి, మార్చి 12: మండలంలో సంఘ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకోవాలని పీపుల్స్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చలపతి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తహసీల్దార్ నుంచి వీఆర్వో వరకు దళిత బలహీన వర్గాల ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు పోలీసులు దళితులపై అక్రమ కేసులు పేడుతూ వారిని హింసించడమే కాకుండా ఫిర్యాదు చేస్తే దళితులపై తిరిగి కేసులు పెడుతున్నారన్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకుల మాటలను విని రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు పేద ప్రజలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకొనేందుకు ఈ నెల 18న నిమ్మనపల్లిలో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పజాసేవా సంస్థ అధ్యక్షుడు సహదేవ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వేలం పాటలు

కలకడ, మార్చి 12:కలకడ పంచాయతీ వేలం పాటలు గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో డీపీవో ధనలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఫ్యారీజాన్ తెలిపారు. బస్టాండు గేట్, దినసరి టమోటా మార్కెట్, వారపు సంత, మూడు షాపింగ్ రూములకు వేలం పాటలు ఉంటాయని తెలిపారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు తప్పవు

మదనపల్లె టౌన్, మార్చి 12: గ్రామ పంచాయతీ, వీకేఎం ఉడా అనుమతి లేకుండా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న అక్రమ లేఅవుట్లపై చర్యలు తప్పవని డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రామాచారపల్లె, వలసపల్లె గ్రామ పంచాయతీల్లో వెలసిన అక్రమ లేఅవుట్లను డీఎల్‌పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనెంబర్లు 14/1, 14/3ఏ, 16/1ఏ, 16/2ఏ, 17/1 డీలలో ఐదెకరాల స్థలంలో లేవుట్ వేశారన్నారు. వాటికి సంబంధిన రికార్డులు తీసుకురావాలని లేఅవుట్ వేసిన యజమానులకు డీఎల్‌పీవో సూచించారు. రికార్డులు సక్రమంగా లేని అక్రమ లేఅవుట్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అందులో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని సంబంధిత శాఖకు లేఖ రాస్తామన్నారు.

కమిటీల వివరాలు, లెక్కలు తెలపండి

● జడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్


వివరాలు తెలపాలని ఎంపీపీని కోరుతున్న జడ్పీటీసీ సభ్యుడు

మదనపల్లె టౌన్, మార్చి 12: మదనపల్లె మండల పరిషత్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఫైనాన్స్ కమిటీ, వర్క్ కమిటీ సభ్యుల వివరాలను లెక్కలను తెలపాలని జడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఎంపీపీ ఇ.రెడ్డెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కమిటీ వివరాలు తెలపాలని ఎంపీడీవోను కోరారు. అంకిశెట్టిపల్లె గ్రామంలో కొన్ని అత్యవసర పనులకు సంబంధించి రికార్డులు చేయడం లేదని సర్పంచ్ శరత్‌రెడ్డి ఆరోపించగా, ప్రతి పనికి గ్రామ పంచాయతీ తీర్మాణం ఉండాలని, తీర్మాణం కాపీ ఇచ్చిన వెంటనే పంచాయతీరాజ్‌శాఖ అధికారులు కొలతలు, రికార్డులు చేస్తారని ఏఈ పీపీ రమణ సమాధానం ఇచ్చారు. గ్రామాల్లో రీసర్వే అంతా తప్పుల తడకగా ఉందని, చిన్న సర్వే చేయాలన్నా అధికారులు లంచాలు అడుగుతున్నారని వైస్ ఎంపీపీ రమణ ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్ఐ రెడ్డెప్ప చెప్పారు. మండలంలో వచ్చే వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు డ్రిల్లింగ్‌కు రూ.42లక్షలతో పనులకు ప్రతిపాదనలు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన తెలిపారు. గ్రామ సచివాలయ నిర్మాణ బిల్లులు ఆలస్యం అవుతున్నాయని పలువురు సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకురాగా అక్టోబరు 31 వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించామని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే రెండో దశ బిల్లులు చెల్లిస్తామని పీఆర్ ఏఈ రమణ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో భానుప్రసాద్, మండల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేడుకగా పార్వేట ఉత్సవం

కలకడ, మార్చి 12:కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం పార్వేట ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలతో వాహనంలో సత్యవతి నదిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. నదిలో అర్చకులు విజయసారథి, సుబ్రమణ్యం, మహేష్‌లు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలను చేశారు. కాగా పార్వేట ఉత్సవంలో భాగంగా స్వామి ఆట విడుపుగా అడివికి వేటకు వెళుతారని చెబుతారు. ఆలయ ధర్మకర్త కె.అఖిలేష్, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కోనేని రెడ్డెప్పనాయుడు, రెడ్డెప్ప, మునిరాజ, నాగరాజు, మల్లికార్జున, రామయ్యచౌదరి, కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా బాటగంగమ్మ మహోత్సవం


అలంకరణలో బాటగంగమ్మ

మదనపల్లె అర్బన్, మార్చి 12: పట్టణ బుగ్గకాలువలో వెలసిన బాట గంగమ్మ గంగజాతర మహోత్సవం రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొగ్గిటి అలివేలమ్మ తెలిపారు. ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి నాదేళ్లనారాయణ స్వామివీధి, వాల్మీకివీధి, బుగ్గకాలువ తదితర ప్రాంతాల నుంచి మహిళలు దీలు బోనాలు బాటగంగమ్మకు సమర్పించారు. బాట గంగమ్మను ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తుల కుదర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో అమ్మవారి భక్తులు పూజలో పాల్గొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదానం, సాయంత్రం ప్రత్యేక వాహనంలో పుష్ప అలంకరణలో అమ్మవారు ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయధర్మకర్త తెలిపారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

గుర్రంకొండ, మార్చి 12:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం సుగంధద్రవ్యాలతో తయారు చేసిన ద్రవ్యాన్ని ఆలయమంతా చల్లి పూజలను చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం మసీదులో సెహరీ ఏర్పాటు

వాల్మీకిపురం, మార్చి 12: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే వారికోసం వాల్మీకిపురం షమ్మ మసీదులో సెహరీ ఏర్పాటు చేసినట్లు మసీదు సెక్రటరీ సయ్యద్‌బాషా పేర్కొన్నారు. సెహరీ తయారు చేసుకోలేని ప్రయాణికులు, కార్మికులు, బయటి ప్రాంతాలకు చెందిన వారి కోసం ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రంజాన్‌మాసంలో ప్రతిరోజూ ఉదయం 4గంటల నుంచి సెహరీ అందుబాటులో ఉంటుందన్నారు.

15న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, మార్చి 12: పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం సమూహాలయంలో ఈనెల 15న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్న వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



మదనపల్లె అర్బన్, మార్చి 12: స్థానిక నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డిలేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో యూత్ కరాటే క్లబ్ అధ్యక్షుడు ఏఆర్‌సురేష్ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న 30మంది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎగ్జామ్‌ప్యాడ్, జామెట్రీబాక్సు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆ పాఠశాల హెచ్‌ఎం జి. రాజేంద్రబాబు, ఏసీటీవో నాగేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, అజయ్ కప్యూటర్ అధినేతలు పాల్గొన్నారు. విద్యార్థి జీవితానికి పదో తరగతి మూలస్తంభంలాంటిదని, పట్టుదల, క్రమశిక్షణ అలవర్చుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మార్చి 12: తంబళ్లపల్లెకు సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40, ఇంటర్మీడియట్ బైపీసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన వారి ఫోన్ నెంబర్లకు సమాచారం పంపిస్తామన్నారు.

నల్లగుట్టపల్లెలో పశువైద్య శిబిరం

గుర్రంకొండ, మార్చి 12:మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించినట్లు కలకడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పశుసంవర్ధక ఏడీ క్రిష్ణయ్య, తేజకల్యాణ్ సహకారంతో మొత్తం 85 పశువులు, లేగ దూడలకు వివిధ వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పునీత్‌చౌదరి, వైవిరమణ, రైస్‌మిల్ రమణ, గౌతమ్‌రెడ్డి, భాస్కరాచారి, రెడ్డిరామ్‌లు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు

● పెద్దపాళ్యం సర్పంచ్ సహా పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక


పెద్దపాళ్యం వైసీపీ సర్పంచ్ ముత్యాల శోభాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు/పెద్దతిప్పసముద్రం మార్చి 12: ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల నుంచి పెద్దపాళ్యం వైసీపీ సర్పంచ్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ములకలచెరువులోని టీడీపీ కార్యాలయంలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సమక్షంలో పెద్దపాళ్యం వైసీపీ సర్పంచ్ ముత్యాల శోభా, మాజీ సర్పంచ్ ముత్యాల వెంకటరమణ, మాజీ సర్పంచ్ ప్రమీల భర్త ఊరగాయల రామచంద్ర, మధు తమ అనుచరులతో టీడీపీలో చేరారు. అలాగే వైసీపీ నాయకులు అక్బర్‌సాబ్, ముస్తఫా, గంగులప్ప, కిష్టా, రామన్న, రమణ, ఖాదర్‌బాషా, శంకర, గంగాద్రి, శ్రీని వాసులు, చందు, గణేష్ తదితరులు టీడీపీలో చేరారు. వారందరికి జయచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ సర్పంచ్ యర్రగుడి సురేష్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రెడ్డెప్ప, అంజనేయరెడ్డి పాల్గొన్నారు. పీటీఎం మండలంలోని బూర్లపల్లెకు చెందిన పలువురు వైసీపీ సీనియర్ నాయకులు మంగళవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ ఆధ్వర్యంలో తంబళ్లపల్లె నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన పలువురు నాయకులు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే స్థానిక నాయకుడైన దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. పార్టీలో చేరిన వారిలో బూర్లపల్లెకు చెందిన సీనియర్ నాయకులు ఆకుతోట మాదవరెడ్డి, బూర్లపల్లె మధు, రాకేష్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, ఎం.ఎన్. బయ్యారెడ్డి, మంత్రి మధుకర్‌రెడ్డిలతో పాటు పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరు


నగిరిమడుగులో ప్రచారం చేస్తున్న టీడీపీ జనసేన నాయకులు

వాల్మీకిపురం, మార్చి 12: వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నగిరిమడుగులో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని ప్రజలంతా ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మదనమోహన్‌రెడ్డి, నాయకులు వెంకటరమణ, చంద్రమౌళి, మురళి,శ్రీనివాసులురెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనాథరెడ్డి, నాగరాజ,ఎండీ యూసుఫ్, రెడ్డెప్ప, టీడీపీ, జనసేన పార్టీల నాయ కులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

చెల్లికే న్యాయం చేయనివాడు ప్రజలకేం చేస్తాడు


సమావేశంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి కొత్తకోట,మార్చి12: తన సొంత చెల్లికి అన్యాయం చేసి రోడ్డుపాలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్ర మహిళలకు ఏం న్యాయం చేస్తాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ విమర్శించారు. మంగళవారం బి కొత్తకోటలో జరిగిన విలేఖర్ల సమావే శంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి వచ్చినసొమ్ముతో సిద్ధం పేరుతో ఒక్కో సభకు రూ.90 కోట్లు ఖర్చుచేసి అధికార దుర్వినియోగానికి పాల్పడుతు న్నారని ఆరోపించారు. ఈ ఐదేళ్ల పాలనలో కబ్జాలు, దౌర్జన్యాలు, కేసులు, కూల్చివేతలు తప్ప ప్రజా సంక్షేమం శూన్యమన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రజలు టీడీపీ-జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పర్వీన్‌తాజ్ కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, చంద్రశేఖర్,కిట్టన్న, మనోహర్‌నాయుడు, పద్మనాభ, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ యువతతోనే సాధ్యం


మాట్లాడుతున్న తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

కురబలకోట, మార్చి 12: రాష్ట్ర భవిష్యత్ యువతతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురీ రమేష్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్ళులో షై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడే బాధ్యత విద్యార్థుల చేతుల్లోనే ఉందని, ఓటుతో సీఎం జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. అసమర్థుడు సీఎం జగన్ కావడం చేత యువత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోయారని ఆరోపించారు. ఐదేళ్ళ ఆయన పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. యువత యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి బొగ్గుభాస్కర్, నూరి, జీవరత్నం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల పేరుతో దందా చేయడమా..?


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పిలె నరసింహులు

మదనపల్లె అర్బన్, మార్చి 12: ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బీజేపీ దందా చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసంహులు ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎన్టీయూ భవన్‌లో సీపీఐ మదనపల్లె నియోజకవర్గ నాయకులతో సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్లు రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎలక్టోరల్ బాండ్లతో ఏరాజకీయ పార్టీకి ఎవరు విరాళం అందించారన్న విషయం తెలియదన్నారు. ఎస్బీఐ వెంటనే బాండ్లు కొనుగోలుదారుల వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, తిరుమల, నూరి, మదవ్, దేవ, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభం


రంజాన్ ఉపవాసదీక్షలను విరమిస్తున్న ముస్లింలు

కురబలకోట, మార్చి 12: పవిత్ర రంజాన్ మాస ఉపవాసదీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆకాశంలో సోమవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. కాగా ఈ ఉపవాస దీక్షల ను అత్యం కఠోరంగా నెల రోజుల పాటు ముస్లింలు ఆచరిస్తారు. వేకు వజామున సహరీతో ఉపవాసదీక్షల ను ప్రారంభించి సాయంత్రం ఇఫ్తారీతో ఉపవాసదీక్షలను విరమిస్తారు. ఇందులో భాగంగా ముస్లింలు మసీదులలో నిర్వ హించిన ప్రార్థనలకు పెద్దసంఖ్యలో హాజరుకావడంతో మసీదులు కిటకిటలాడాయి.

బలిజసేన జిల్లా ఉపాధ్యక్షుడిగా శివశంకర్



మదనపల్లె టౌన్, మార్చి 12: బలిజసేన అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడుగా మదనపల్లెకు చెందిన బైరిశెట్టి శివశంకర్‌ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌కు చెందిన బైరిశెట్టి శివశంకర్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని, బలిజల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్‌రాయల్‌కు, జిల్లా అధ్యక్షుడు నరసింహులుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.